నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, మంగళవారం 30 ఏప్రిల్ 2024 | KARIMNAGAR

# అభివృద్ధి అంటే కేసీఆర్ సర్కారుదే

"ప్రశ్నించే గొంతుకకు అవకాశమివ్వండి"

- రాష్ట్రంలో, కేంద్రంలో కొట్లాడి నిధులు తెస్తా
- ప్రజా సమస్యలు పరిష్కరిస్తా
- కాంగ్రెస్‌ను నాలుగు నెలల్లోనే ప్రజలు అసహ్యించుకునే దుస్థితి
- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

జ్యోతినగర్, ఏప్రిల్ 29: రాష్ట్రంలో అభివృద్ధి అంటే కేసీఆర్ సర్కార్‌దేనని, పదేండ్ల పాలనలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కొనియాడారు. 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పనైపోయిందని తీవ్రంగా విమర్శించారు. తాము ఓటు ఎందుకు వేశామని ప్రజలు బాధపడుతున్నారని, నాలుగు నెలల్లోనే అసహ్యించుకునే దుస్థితి వచ్చిందన్నారు. మన హక్కులు మనకు దక్కాలన్నా, న్యాయంగా నిధులు రావాలన్నా తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి పార్లమెంట్‌కు పంపాలని కోరారు. తాను ప్రశ్నించే గొంతుకనవుతానని, రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో వచ్చే ప్రభుత్వంతోనూ కొట్లాడి ప్రజా సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎన్టీపీసీలోని టీవీ గార్డెన్‌లో సోమవారం జరిగిన రామగుండం నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి కొప్పుల ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ పాలనలో పుష్కలంగా సాగు నీరు, కరెంట్ ఇచ్చారని, రైతుబంధు సకాలంలో అందించారని, పేదల సంక్షేమానికి అనేక పథకాలతో చేయూతనిచ్చి ఆదర్శంగా నిలిచామని గుర్తుచేశారు. గోదావరి తీరం పొడవునా బరాజ్‌లు, రిజర్వాయర్లు నిర్మించి రైతు కండ్లలో కేసీఆర్ ఆనందం నింపారని చెప్పారు. కానీ, ప్రస్తుత ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డి ప్రజలను అరిగోసపెడుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ నిర్లియ్యక రైతు కండ్లలో దుఃఖాన్ని మిగిల్చిందని మండిపడ్డారు. సాగునీరు లేక పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. మరోసారి నమ్మి కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోవద్దని సూచించారు.

## కేసీఆర్ శ్రీరామరక్ష

తెలంగాణ ప్రజల ప్రయోజనాలను ఎల్లప్పుడూ కాపాడేది కేసీఆరే. రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ శ్రీరామరక్ష. రాష్ట్రంలో కేసీఆర్ బస్సుయాత్రకు విశేష స్పందన వస్తున్నది. అది చూసి కాంగ్రెస్ శ్రేణుల్లో వణుకు పుట్టింది. ఈ ఎన్నికల్లో వాళ్లకు ఓటమి తప్పదు. వచ్చే నెల 3, 4 తేదీల్లో రామగుండంలో కేసీఆర్ బస్సు యాత్రను విజయవంతం చేయాలి.

**కొప్పుల ఈశ్వర్**

## పెద్దపల్లి ఎంపీ సీటును కానుకగా ఇవ్వాలి



మన సింగరేణి కార్మికుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు కొప్పుల ఈశ్వర్‌కు పెద్దపల్లి అభ్యర్థిగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అవకాశం కల్పించడం హర్షనీయం. పెద్దపల్లి ఎంపీ సీటును గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలి. గోదావరిఖనిలో మక్కాన్‌సింగ్ కక్షపూరిత పాలన కొనసాగిస్తున్నరు. అక్రమంగా కేసులు పెట్టిస్తున్నరు. వాటన్నింటికీ చెక్ పెట్టాలంటే దమ్మున్న ఈశ్వరన్నను భారీ మెజార్టీతో గెలిపించాలి. అందుకు ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త ఈ పది రోజులపాటు కష్టపడి పనిచేయాలి. కేసీఆర్ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించి, చైతన్యవంతం చేయాలి. **- కోరుకంటి చందర్, రామగుండం మాజీ ఎమ్మెల్యే**

# కోడ్ ఉల్లంఘనలా.. అయితే ఫిర్యాదు చేయండి

రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి

కరీంనగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 29 : కరీంనగర్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో కోడ్ ఉల్లంఘనతోపాటు ఎలాంటి ఫిర్యాదులు, సలహాలు, సూచనలు చేయాలనుకున్నా ఎన్నికల పరిశీలకులను నేరుగా కానీ, ఫోన్ ద్వారానైనా సంప్రదించవచ్చని రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సాధారణ పరిశీలకులు ఐఏఎస్ అధికారి అమిత్ కటారియా(9177435833O)కు, నగదు, మద్యం, ఇతర సామగ్రి తరలింపును అడ్డుకోవడంతోపాటు ఓటర్లను ప్రలోభపెట్టే అంశాలపై ఎన్నికల పోలీస్ పరిశీలకులు, ఐపీఎస్ అధికారి మనీశ్ చౌదరి(7032800525O)కు, ఎన్నికల వ్యయానికి సంబంధించి వ్యయ పరిశీలకుడు అశ్వినికుమార్ పాండే(9032659531)కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# కాంగ్రెస్, బీజేపీని నమ్మితే మునుగుడే

**చోటా భాయ్.. బడే భాయ్ కలిసి హైదరాబాద్‌ను యూటీ చేసే కుట్ర**

- ఆరు గ్యారెంటీలతో ఇప్పటికే మోసం
- ప్రస్తుత సర్కారు ఎప్పుడు ఊడుతుందో తెలియదు
- గోదావరి నీళ్లను తమిళనాడుకు తరలించేందుకు యత్నం
- ఆ రెండు పార్టీల కుట్రలు భగ్నం చేయాలంటే బీఆర్ఎస్‌కే ఓటేయాలి
- ఎన్నికల వేళ ఆగం కావొద్దు.. ఆలోచించాలి
- కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్
- కమలాపూర్, హుజూరాబాద్ మండలాల్లో రోడ్‌షో



కమలాపూర్ మండలం శనిగరంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



శనిగరం రోడ్‌షోకు పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు

హుజూరాబాద్/ కమలాపూర్, ఏప్రిల్ 29 : కాంగ్రెస్, బీజేపీని నమ్మితే మునుగుడు ఖాయమని, మరోసారి ఆగమై మోసపోవద్దని ప్రజలకు కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు మంచి చేసిందెవరో.. చేసేదెవరో ఆలోచించాలని సూచించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న చోటా భాయ్ రేవంత్‌రెడ్డి.. కేంద్రంలో ఉన్న బడే భాయ్ నరేంద్రమోదీ కలిసి హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం (యూటీ) చేసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు ఇస్తామని ఉత్త మాటలు.. ఉద్దెర హామీలు ఇచ్చిన కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు ఇప్పటికే మోసపోయి గోసపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల వేళ కాంగ్రెస్ గారడీలను, బీజేపీ దొంగ మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. తెలంగాణ హక్కులను కాపాడుకోవాలన్నా.. పార్లమెంట్‌లో గళం వినిపించాలన్నా బీఆర్ఎస్ ఎంపీగా తనను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం బత్తినివానిపల్లి హనుమాన్ ఆలయంలో సోమవారం ఆయన పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి గోపాల్‌పూర్, శనిగరం గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. రాత్రి హుజూరాబాద్ మండలం కందుగుల, కనుకులగిద్ద గ్రామాల్లో కార్నర్ మీటింగ్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల వినోద్‌కుమార్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరిట ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ధ్వజమెత్తారు. ఆ పార్టీలో రెండేళ్లకోసారి సీఎం మారుతారని, ఇప్పుడున్న ప్రభుత్వం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉన్నదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ గోదావరి నీళ్లను తమిళనాడుకు తరలించేందుకు రాజకీయ కుట్రకు తెరలేపిందని, తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన సమయం వచ్చిందని సూచించారు. తెలంగాణలో నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నా ఒక్క నవోదయ పాఠశాల తీసుకురాలేదన్నారు. కరీంనగర్ ఎంపీగా ఉన్న బండి సంజయ్ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నా ఐదేళ్లలో ఒక్క పైసా తీసుకురాలేదని మండిపడ్డారు. 2014లో తాను ఎంపీగా గెలిచి రూ.వెయ్యి కోట్ల నిధులతో కరీంనగర్ స్మార్ట్ సిటీ, కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్, ₹50 కోట్లతో కరీంనగర్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మాణం, జాతీయ రహదారులు తీసుకువచ్చానని, పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఉప్పల్ ఆర్వోబీ బ్రిడ్జి రైల్వే ట్రాక్‌కు రెండు వైపులా రాష్ట్ర ప్రభుత్వంతో పూర్తి చేయించి నాలుగేళ్లు అవుతున్నదని, ఐదేళ్లు ఎంపీగా ఉండి బండి సంజయ్ రైల్వే ట్రాక్‌పై బ్రిడ్జి పూర్తిచేయించలేదని మండిపడ్డారు. దీంతో ప్రయాణికులు ఐదేళ్లుగా రైల్వేగేట్ వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఉప్పల్ ఆర్వోబీ నిర్మాణమే బండి సంజయ్ పనితీరుకు నిదర్శనమని ప్రజలు గుర్తించాలన్నారు. తెలంగాణ విద్యార్థుల భవిష్యత్ బాగుండాలని కేసీఆర్ 33 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తనకు అవకాశమిస్తే పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకనవుతానని చెప్పారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం రామక్క పాటకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి శాలినిరెడ్డి దపంతులు, వినోద్‌కుమార్ కోడలు హర్షిణి ప్రజలతో కలిసి డ్యాన్స్ చేశారు. ఆయాచోట్ల జరిగిన కార్యక్రమాల్లో జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జడ్పీటీసీలు పడిదం బక్కారెడ్డి, లాండిగ కల్యాణి, ఎంపీపీ తడక రాణి, సింగిల్ విండో చైర్మన్ సంపత్‌రావు, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, నాయకులు ఐలయ్య, బెల్లి రాజయ్య, సతీశ్, కాసం రఘుపతి రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కానుగంటి శ్రీనివాస్, శ్యాంసుందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.





శనిగరంలో కారు గుర్తుకు ఓటు వేయాలని మహిళలను అడుగుతున్న వినోద్‌కుమార్



బోనంతో ఎమ్మెల్యే సతీమణి శాలినిరెడ్డి, వినోద్‌కుమార్ కోడలు డాక్టర్ హర్షిణి

## వినోద్‌ను గెలిపిస్తే జోడెద్దుల్లా పనిచేస్తాం

ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చింది. మహిళలకు ₹2500, వరి ధాన్యం క్వింటాలుకు ₹500 బోనస్, ₹2 లక్షల రుణమాఫీ ఇస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇచ్చిండా..? ప్రజలు ఆలోచన చేయాలి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అవకాశమిస్తే తెలంగాణను మళ్లీ ఆంధ్రాలో కలుపుతుంది. బీజేపీ దొంగ మాటలు, కాంగ్రెస్ గారడీ మాయలో పడి మోసపోవద్దు. ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలు చేసే పార్టీ బీఆర్ఎస్సే. పదేళ్లలో కేసీఆర్ చేసిన ఎన్నో అభివృద్ధి పనులను గుర్తించండి. ఎంపీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి. ఆయనను గెలిపిస్తే జోడేద్దుల్లాగా పనిచేస్తాం.

**- పాడి కౌశిక్‌రెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే**

# లెక్క తప్పితే అంతే





- పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల వ్యయంపై ఈసీ నిఘా
- ₹95 లక్షలే పరిమితి
- అదనంగా రూపాయి పెరిగినా వేటే

కరీంనగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 29 : లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఆచితూచి ఖర్చు చేయాలి. ఎన్నికల సంఘం నిర్దేశించిన మొత్తానికి ఒక్క రూపాయి అదనంగా వ్యయం చేసినా, అభ్యర్థుల వేటు పడక తప్పదు. ఓడిపోయిన అభ్యర్థి అయితే, ఈసీ సూచన మేరకు పోటీకి దూరంగా ఉంచడం, గెలిచిన అభ్యర్థి అయితే అనర్హత వేటు వేయడం, రెండో స్థానంలో ఉన్న అభ్యర్థికి అవకాశం కల్పించేలా ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటుంది. అభ్యర్థులు ప్రతి నిత్యం చేస్తున్న ఎన్నికల వ్యయాన్ని డేగ కండ్లతో పరిశీలిస్తుంది. అందుకోసం ప్రత్యేక బృందాలతో పాటు పలువురు ఐఏఎస్ అధికారులను పరిశీలకులుగా కూడా నియమించింది. ఎన్నికల్లో ధన ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలనే సంకల్పంతో కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న ఈ నిర్ణయం పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నది. నామినేషన్ వేసే దాకా ఇష్టారాజ్యంగా ఖర్చు పెట్టిన అభ్యర్థులు, అనంతరం రూపాయి వ్యయం చేయాలన్నా ఆలోచించాలి. ఎన్నికల సంఘం నిర్ణయించిన ధరల ప్రకారమే ఖర్చులు చూపాల్సి రావడంతో అభ్యర్థులు చిన్న పొరపాటు కూడా జరుగకుండా జాగ్రత్త పడాల్సి ఉంటుంది. ఈసీ నిర్ణయించిన ధరలు మాత్రమే ఎన్నికల వ్యయ పుస్తకంలో పొందుపర్చాల్సి ఉండడంతో, ఎప్పటికప్పుడు అభ్యర్థులు అందజేసే ఖర్చుల వివరాలు, ఎన్నికల పరిశీలకులు సేకరించే వివరాలతో సరిపోయేలా చూసుకోవాలి. ఏ చిన్న పొరపాటు జరిగినా ఎన్నికల సంఘానికి నివేదికలు పంపితే, వేటు తప్పదని గ్రహించాలి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ₹95 లక్షలు మాత్రమే ఖర్చు చేయాలి. ఈ మొత్తం గత పార్లమెంటు ఎన్నికల్లో ₹70 లక్షలు మాత్రమే ఉండగా, పెరిగిన ఖర్చుల నేపథ్యంలో మరో ₹20 లక్షలు అదనంగా ఈసీఐ పెంచింది. ఈ మొత్తానికి అదనంగా వ్యయం చేస్తే గెలిచిన అభ్యర్థికైనా పదవీ గండం తప్పదని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. నామినేషన్ వేసిన రోజు నుంచే ఖర్చు లెక్కిస్తుండగా, గతంలో మాదిరి ఈసారి ఒకరిద్దరు ప్రధాన పార్టీల అభ్యర్థులు మినహా, మిగతా వారంతా సాదాసీదాగానే రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల నాటి నుంచి ఓట్ల లెక్కింపు వరకు అభ్యర్థికయ్యే ఖర్చు వారి ఖాతాలోనే జమ కానుండగా, ప్రతి పైసా ఖర్చుకు విధిగా లెక్క చూపాలి. నామినేషన్ వేసే ముందు అభ్యర్థులు తీసిన కొత్త బ్యాంకు ఖాతా నుంచి మాత్రమే లావాదేవీలు నిర్వహించాలి. ఎన్నికల పరిశీలకులుగా జిల్లాకు ముగ్గురు సివిల్ సర్వీసెస్ అధికారులను ఈసీఐ కేటాయించింది. వీరు ఐదు రోజుల క్రితమే జిల్లాకు వచ్చి తమ విధులు నిర్వర్తిస్తుండగా, లోక్‌సభ పరిధిలో ఐదు సార్లు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి అభ్యర్థులు చేస్తున్న వ్యయం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అంశాలు పరిశీలించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం నుంచి మొదలు ఓట్ల లెక్కింపు వరకు నియోజకవర్గాల పరిధిలో ఉంటూ, అభ్యర్థులు చేస్తున్న వ్యయాన్ని నిశితంగా చూడనున్నారు.

# కరీంనగర్ బరిలో 28 | పెద్దపల్లి బరిలో 42

## తేలిన ఎంపీ అభ్యర్థుల సంఖ్య

- ముగిసిన ఉపసంహరణల పర్వం
- కరీంనగర్‌లో ఐదుగురు, పెద్దపల్లిలో ఏడుగురు విత్‌డ్రా

**కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ బరిలో నిలిచే అభ్యర్థుల లెక్క తేలింది. కరీంనగర్ నుంచి 28 మంది, పెద్దపల్లి నుంచి 42 మంది పోటీలో నిలువనున్నారు. కాగా, సోమవారం ఉపసంహరణల ప్రక్రియ ముగియగా, కరీంనగర్‌లో ఐదుగురు, పెద్దపల్లిలో ఏడుగురు విత్ డ్రా చేసుకున్నారు. దాంతో పోటీలో ఉన్న అభ్యర్థుల లిస్ట్‌ను అధికారులు ప్రకటించారు.**

పెద్దపల్లి, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ)/కరీంనగర్ కలెక్టరేట్ : కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, పెద్దపల్లి లోక్‌సభ స్థానాల్లో పోటీలో నిలిచిన అభ్యర్థుల లెక్క తేలింది. ఈ నెల 18 నుంచి 25 వరకు నామినేషన్లకు అవకాశం ఉండగా, పెద్ద సంఖ్యలో అభ్యర్థులు దాఖలు చేశారు. అయితే సోమవారం పలువురు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో పోటీలో ఎంతమంది నిలిచారో యంత్రాంగం ప్రకటించింది. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ బరిలో 28 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం 33 మంది నామినేషన్ వేయగా, ఐదుగురు విత్‌డ్రా చేసుకున్నారు. బరిలో నిలిచిన వారిలో 13 మంది వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు కాగా, 15 మంది స్వతంత్రులు ఉన్నారు. ఉపసంహరించుకున్న వారిలో మహ్మద్ జిషాన్, గుజ్జుల శ్రీనివాస్‌రెడ్డి, ఆరెల్లి సుమలత, పిడిశెట్టి రాజు, పచ్చిమట్ల రవీందర్ ఉన్నారు. వీరంతా రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతికి తమ ఉపసంహరణ పత్రాలు అందజేశారు. ఇక పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ బరిలో 42 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం 49 మంది నామినేషన్ వేయగా, ఏడుగురు విత్‌డ్రా చేసుకున్నారు. వారిలో అభ్యర్థులైన గవ్వల శ్రీకాంత్, జాడి బాల్ రెడ్డి, మోటం రవీందర్, జుమ్మిడి గోపాల్, జాడి ప్రేమ్ సాగర్, దుర్గం సమ్మయ్య, దాగం సుధారాణి అభ్యర్థులు ఉన్నారు. వీరంతా రిటర్నింగ్ అధికారి ముజామ్మిల్ ఖాన్‌ను తమ ఉపసంహరణ పత్రాలు అందజేశారు. కాగా, రాజకీయ పార్టీల నుంచి బరిలో నిలిచిన వారికి ఆయా పార్టీల గుర్తులు కేటాయించనుండగా, స్వతంత్రులకు ఎన్నికల సంఘం విడుదల చేసిన గుర్తులను రిటర్నింగ్ అధికారులు కేటాయించారు.

# కాంగ్రెస్ అంటేనే వంచన

- ఆ పార్టీవి మోసపూరిత మాటలు
- ఆచరణ సాధ్యం కాని వాగ్దానాలతో గద్దెనెక్కింది
- జీవన్‌రెడ్డి దేవుడి సాక్షిగా ప్రమాణం చేసిన హామీలు సైతం అమలైతలేవు
- కేసీఆర్ బస్సు యాత్ర ఫలితంగానే చివరి ఆయకట్టుకు నీటి విడుదల
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
- బీర్‌పూర్, తుంగూర్‌లో ఎన్నికల ప్రచారం



బీర్‌పూర్‌లో ఉపాధికూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

సారంగాపూర్, ఏప్రిల్ 29: 'కాంగ్రెస్ అంటేనే నయవంచన పార్టీ. మోసపూరిత మాటలు.. ఆచరణ సాధ్యంకాని వాగ్దానాలతో గద్దెనెక్కింది. ప్రజలను నిండా ముంచింది' అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో జీవన్‌రెడ్డి దేవుడి సాక్షిగా ప్రమాణ చేసి ఇచ్చిన హామీలు సైతం అమలు చేయడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం హామీలన్నీ నెరవేర్చాలన్నా, ప్రజా సమస్యలు పరిష్కారం కావాలన్నా కొట్లాడేందుకు బీఆర్ఎస్‌కు ఓటువేయాలని కోరారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సుయాత్ర ఫలితంగానే ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేశారని, పంటలకు చివరి దశలో నీరందు రైతన్నకు లభం జరిగిందన్నారు. జగిత్యాల ఎన్నికల ఇన్‌చార్జి లోకబాపురెడ్డితో కలిసి సోమవారం బీర్‌పూర్ మండలం బీర్‌పూర్, తుంగూర్ గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అలాగే నర్సింహులపల్లిలో ఆయా గ్రామాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వందరోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి చేతలెత్తేసిన రేవంత్‌రెడ్డి, వచ్చే ఆగస్టులోగా రైతు రుణమాఫీ చేస్తామని చెబితే నమ్మేదెలా..? అని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, కానీ, కాంగ్రెస్ నాలుగు నెల పాలనలోనే నరకం చూస్తున్నారన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పనిచేసేవారికే ఓటు వేయాలని, అప్పుడే ఈ ప్రాంతానికి లాభం జరుగుతుందన్నారు. ఢిల్లీలో బీఆర్ఎస్ ప్రాతినిధ్యం ఉంటేనే మన నిధులు, మన హక్కులు మనకు దక్కుతాయన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, మాజీ ఎంపీపీ కొల్ముల రమణ, పార్టీ అధ్యక్షులు నారపాక రమేశ్, ప్రధాన కార్యదర్శి శీలం రమేశ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రావు, రామకిష్టు గంగాధర్, యూత్ అధ్యక్షుడు గాజర్ల రాంచంద్రం గౌడ్, మాజీ విండో చైర్మన్ మెరుగు రాజేశం, నాయకులు ఎడ్ల సుశిన్, బోడ సాగర్, కృష్ణ, లక్ష్మణ్, రామ్, శేఖర్ ఉన్నారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

వేములవాడ, ఏప్రిల్ 29: వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కరీంనగర్ డీఐజీ రవీందర్ సోమవారం తనిఖీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియతోపాటు పలు పత్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, సాధారణ తనిఖీల్లో భాగంగా తాను కార్యాలయాన్ని తనిఖీ చేశానన్నారు. కార్యాలయానికి రిజిస్ట్రేషన్ల తాకిడి ఎక్కువగా ఉన్నందున సరైన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వపరంగా ఖాళీగా ఉన్న భవనాల్లోకి మార్చాలన్నారు. ప్రజలకు సులువైన సేవలతోపాటు సౌకర్యవంతంగా ఉండేందుకు అనువైన భవనాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట సబ్ రిజిస్ట్రార్ సురేంద్రబాబు, తదితరులు ఉన్నారు.

